సౌదీ అరేబియాలో చినవంక యువకుడు మృతి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం చినవంక గ్రామానికి చెందిన యువకుడు మదనాల శంకర్ అలియాస్ సతీష్ (32) బుధవారం తెల్లవారు జామున ఉదయం సౌదీ అరేబియాలో బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సతీష్ నాలుగు నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. మృతుడు తల్లి కాంతమ్మ గత ఏడాది అనా రోగ్యంతో మృతి చెందారు. మృతినికి తండ్రి సూర్య నారాయణ తో పాటు ఒక చెల్లి కూడా ఉంది. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చే విధంగా ప్రజా ప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులతో పోటు స్థానికులు కోరుతున్నారు.

సాధారణ ఎన్నికల ప్రక్రియకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జీలాని సమూన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : విజయవంతంగా కౌంటింగ్ నిర్వహణకు సూచనలు, సలహాలు అందజేసిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వారికి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జీలాని సమూన్ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే జిల్లాలో గెలుపొందిన పార్లమెంట్ అభ్యర్థి కి, 8 నియోజకవర్గాల శాసన సభ్యులకు అభినందనలు తెలియ జేశారు. జిల్లాలో నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహీల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్ సంగీత, అజిజ్ శుక్లదాస్ లు, జిల్లాలో పోలింగ్ నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్ భద్రత అలాగే కౌంటింగ్ ఏర్పాట్లలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టిన జిల్లా ఎస్పీ జి. ఆర్ రాధిక కి, ఆమదాలవలస నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్, టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జిల్లా పరిషత్ సిఈఓ వెంకటేశ్వరరావు, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, డాక్టర్ భరత్ నాయక్, అప్పారావు, సి.హెచ్. రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, నోడల్ అధికారులు జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, ఎన్నికల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వ హణకు సహకరించిన అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, రాజకీయ పార్టీలు, సంస్థలు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహాయ సహకారాలు అందజేసిన ఎన్ సి సి, ఎక్స్ -సర్వీమెన్ లకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లా ప్రజలకు, ఓటర్లకు, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓలు, సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలు, అన్ని రకాల నిఘా స్క్వాడ్లు, సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు నుండి బిఎల్ఓ గ్రామ స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఫెసిలిటేటర్ ఇతర ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీ డిఓలు, సిబ్బందికి, ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లకు, ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ రిటర్నింగ్ అధికారులకు సూచనలు, పలు ఆదేశాలు ఇస్తూ ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల మేరకు కౌంటింగ్ వేగంగా జరిగేలా, ఫలితాలను సకాలంలో వెల్లడించేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ అనంతరం బుధవారం ఒక ప్రకటనలో అందరికి ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాకుళం శివాని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాల్లో మంగళవారం ఉదయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడం జరిగిందన్నారు.

ఇది ఎచ్చెర్ల ప్రజల విజయం : ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : శాసనసభ ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను 29089 ఓట్ల అఖండ మెజారిటీతో గెలిపించినందుకు శిరస్సు వంచి ప్రతిఒక్కరికీ నమస్కరిస్తున్నానని, నన్ను ఓ కుటుంబ సభ్యుడిలా ఆదరించిన మీ రుణం తీర్చుకోలేనిదని ఎచ్చెర్ల బీజేపీ ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొ న్నారు. ఈ విజయానికి చెమటోడ్చి శ్రమించిన బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నానన్నారు. మన నియోజకవర్గం ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం నా పూర్వ జన్మ సుకృతం. ఎచ్చెర్లను ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడానికి మీ ఆశీస్సులు, సహకారం ఎల్లవేళలా ఇలానే కొనసాగిస్తారని ఆశిస్తున్నానన్నారు.

పర్యావరణ పరిరక్షణ ఓ సామాజిక బాధ్యత

జిల్లా విద్యాశాఖాధికారి వేంకటేశ్వరరావు

విశాలాంధ్ర - ఆమదాలవలస : పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వం రావు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ జయప్రకాష్ శ్రీకాకుళం ఉప విద్యా శాఖ అధికారిని ఆర్ విజయ్ కుమారి మిషన్ లైఫ్ వారోత్సవాలను లాంఛ నంగా మొక్కలు నాటి ప్రారంభించారు. రాను రాను ప్రపంచీకరణ నేప థ్యంలో ఓవైపు పారిశ్రామికీకరణ మరోవైపు పట్టణీకరణ జరుగుతున్న తీరు అభివృద్ధికి చిహ్నమైనప్పటికీ అడవులు నరికి వేయడం వలన పర్యావరణం సమతుల్యత ఘోరంగా దెబ్బతింటుందని అందులో భాగంగా నే గ్లోబల్ వార్మింగ్ విపరీతంగా పెరిగి పోతుందని ఈ వేసవిలో ఢిల్లీలో 501 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోద య్యాయి అంటే చాలా జీవరాసులు ముఖ్యంగా పక్షులు అంతరించి పోతా యని దీనికి కారణం భూతమైనమాన వీయ కార్యకలాపాలు అనేకం మాను కోవలసినటువంటి అవసరం ఉందని ప్లాస్టిక్ అడవుల నరికివేత పారిశ్రామి క వ్యర్థాలు పర్యావరణంలో కలిసి పోయి వర్షాభావ పరిస్థితులకు ప్రధా న కారణం అవుతున్నాయని పర్యావ రణాన్ని నష్టపరిచే ఇటువంటి మాన వీయ కార్యకలాపాలు నియంత్రించు కోవాలని డీఈవో అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు నుండి 11వ తేదీ వరకు వారోత్సవాలు జరపాల్సి ఉండగా పాఠశాలలకు సెలవులు కారణంగా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఈ వారోత్సవాల ప్రణాళికను రీ షెడ్యూల్ చేస్తూ లాంచనంగా ఈరోజు జిల్లా కేంద్రంలో ప్రారంభించి పాఠశాల పున ప్రారంభమైన తరువాత 12వ తేదీ నుండి 19వ తేదీ వరకు క్రింది పేర్కొన్న విధంగా ఆయా తేదీలలో ప్రతి పాఠశాలలోనూ కార్యక్రమాలను చేపట్టాలని విద్యార్థి దశలోనే పర్యావరణ పరిరక్షణకు ఒక ఉద్యమంగా చేపట్టాలని వివిధ రకాల కార్యక్రమాల ద్వారా సమాజాన్ని చైతన్య పరచాలని ఏపీసి జయప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ సిబ్బంది ప్రభా కరరావు, లక్ష్మీనారా యణ జనార్ధన్,నలినికాంత్,శోభ మరియు గ్రీన్ టీచర్ రీజినల్ కో ఆర్డినేటర్ కుమారస్వామి,జిల్లా గ్రీన్ టీచర్ సమన్వయకర్త గోవింద రావు,ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వద్దు... మట్టే ముద్దు

కాకినాడ శ్రీ ఆదిత్య ప్రిన్సిపాల్ ఎన్. వి. వేణుగోపాల్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని నగరంలో ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల (కొఎడ్)లో ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1 లో గల 50 మంది వాలంటీర్స్‌తో కాలేజీ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారని ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామర్ ఆఫీసర్ ఎం. నాగభూషణరావు తెలిపారు. ఇందులో భాగంగ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. వి. వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచం లో ప్రాణం కంటే విలువైనది పర్యావరణాన్ని కాపాడుకోవడమని, ప్రాంగనంతో పాటు నగరాన్ని పరిశుభ్రంగా వుంచాలంటే విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కళాశాల ఆవరణలో పచ్చని మొక్కల్ని నాటించి 50 మంది విద్యార్థులతో క్లీన్ అండ్ గ్రీ అనే కార్యక్రమాన్ని నిర్వహించామని, పర్యావరణాన్ని కాపాడుకుందాం " పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు", "ప్లాస్టిక్ వద్దు మట్టే ముద్దు" అనే నినాదానంతో ర్యాలీని చేపట్టి అందరిలో స్ఫూర్తి నింపారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, టి. పద్మావతి, ఎస్.వి.దుర్గా ప్రసాద్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘన విజయం ప్రజలకే అంకితం : గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : ఇంతటి ఘన విజయం ప్రజలకే అంకితమని పలాస నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన ఈ పదవిని బాధ్యతగా భావిస్తూ వారు ఎదు ర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం పలాస టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీష విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని, వారికి ఓటు రూపంలో రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రంలో 164 సీట్లు ఇచ్చి ఎన్డీఏ కూటమి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు, తనకు అఖండ విజయాన్ని చేకూర్చిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో తనతో పాటు అన్ని కార్యక్రమాల్లో కష్ట సుఖాల్లో పాలు పంచుకొని తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విధాలుగా సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం పెట్టుకుని శాసనసభ్యునిగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ చరిత్రలో ఏనాడూ ఏ అభ్యర్థికి రాని అత్యధిక మెజార్టీని తనకు ఇచ్చిన ఓటర్లు అందరికి ఐదేళ్లు నిరంతరం ప్రజాసేవలో ఉండి ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటానన్నారు.

హ్యాట్రిక్ విజేతకు అడుగడుగునా నీరాజనం

కొర్లాం నుంచి కవిటి వరకు భారీ ఊరేగింపుగా ఎమ్మెల్యే అశోక్

విశాలాంధ్ర - సోంపేట : ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన హ్యాట్రిక్ విజేత ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఎన్నికల ఫలితాల అనంతరం బుధవారం ఉదయం శ్రీకాకుళం నుంచి సోంపేట మండలం కొర్లాం వద్ద ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అడుగు పెట్టడంతో అక్కడ నుంచి మొదలు తన స్వగ్రామం కవిటి సమీపంలో రామయ్యపుట్టుగ వరకు ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు అడుగడుగునా నీరాజనం పలికారు. సుమారు 40 వేల ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థిని పిరియా విజయ మీద గెలుపొందిన అశోక్‌కు ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు భారీ ఊరేగింపుతో బ్రహ్మరథం పట్టారు. సోంపేట మండలంలో కొర్లాం, లక్కవరం జంక్షన్, బేసి రామచంద్రాపురం జంక్షన్, బూరగాం జంక్షన్, కంచిలి, మకరాంపురం జంక్షన్, బైరిపురం జంక్షన్, గొర్లెపాడు జంక్షన్, కొజ్జిరియా, రాజపురం, బొర్రపుట్టుగ మీదుగా కవిటి మండల కేంద్రానికి ర్యాలీ చేరుకునేందుకు కొన్ని గంటల సమయం పట్టింది. ప్రతిచోటా పెద్దసంఖ్యలో కార్యకర్తలు, మహిళలు చేరుకుని ఎమ్మెల్యే అశోక్‌కు శు భాకాంక్షలు తెలుపుతూ విజయహారతులు ఇచ్చి తిలకం దిద్ది ఆశీర్వదించారు. దారి పొడవునా అభిమానులు, కార్యకర్తలు జిందాబాద్ అశోక్ అంటూ నినాదాలు చేస్తూ డ్యాన్సులు వేస్తూ తమ ఆనందాలను పంచుకున్నారు. ఉద్దానం ముద్దుబిడ్డగా వరుసగా మూడుసార్లు విజేతగా నిలిచిన అశోక్‌కు తిరుగు లేదని ఆయన చేపట్టిన అభివృద్ధి ప్రజలపైన, కార్యకర్తలపైన చూపించిన ప్రేమాభిమానాలే ఇంతటి ఘన విజయానికి కారణమని కార్యకర్తలు కొనియాడారు. కవిటిలో మండల ఇలవేల్పు శ్రీచింతామణి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అనేక మంది ఎమ్మెల్యే అశోక్‌కు అనేక చోట్ల దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించిన అనంతరం తొలిసారి ఇంటికి చేరుకున్న అశోక్‌కు స్వగ్రామానికి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో హాజరై దిష్టి తీసి హారతులిచ్చారు. ఈ విజయోత్సవంలో కొర్లాం వద్ద కూటమి నాయకులు బీన వంశీ, పూడి తిరుపతిరావు, భిర్లంగి ఉమామహేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జీ, జీవితేశ్వరరావు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి తరాన్ని కాపాడటం మన అందరి బాధ్యత

సుడా అధికారి చల్లా ఓబులేష్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రేపటి తరాన్ని కాపాడటం మన బాధ్యతని శ్రీకాకుళం సుడా అధ్యక్షులు చల్లా. ఓబులేష్ బుధవారం అన్నారు. స్థానిక శాంతి నగర్ కొలనీలో గల గాంధీ మందిరం లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ప్రకృతితో మనం బాధ్యతగా ఉంటే ప్రకృతి మనల్ని ప్రేమిస్తుందని, ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని రక్షిస్తూ, ముందుకు సాగితే, ప్రకృతి మన భవిష్యత్ తరాలకు సాయం చేస్తుందన్నారు. నేడు ప్రపంచ పర్యారణ దినోత్సవం సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు చెయ్యటం హర్షణీయమన్నారు. లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ. రవి కుమార్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యతని, ప్రతీ ఒకరూ మొక్కల్ని నాటి, వాటిని సంరక్షించే బాత్యతను కూడా చూసుకోవాలని, అప్పుడే మనం నాటే మొక్కకు, రేపటి యువతరానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు డా. బొడ్డేపల్లి సురేష్, మాట్లాడుతూ ప్రపంచం మొత్తం పర్యావరణం గురించి ఈ రోజు మాట్లాడుకుంటుందని, భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను తగ్గించే గుణం మొక్కలకు, చెట్లకు ఉందని, వాటి సంరక్షణ మనమందరం కలసి చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గాంధీ భవన ప్రాంగాణంలో మొక్కలు నాటి, స్థానిక డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పాత బస్ స్టాండ్ తో పాటు పలు ముఖ్య కూడలిలో ప్రజలకు సుమారు ఏడు వందల మొక్కలను అందజేసి వాటి పరిరక్షణ బాధ్యతను వివరించారు. ఈ కార్యక్రమం లో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ ఛైర్పర్సన్ బి. దేవభూషణం, సెక్రటరీ టి. రాంగోపాల్, ట్రెసరర్ ఎస్. మణి, సభ్యులు చల్లా. జోషత, గాంధీ మందిరం రాజా రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును శిరసా వహిస్తా : మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర - ఆముదాలవలస : ప్రజా స్వామ్యంలో ప్రజలే ప్రభువు లని, ప్రజానీకం ఇచ్చిన అంతిమ తీర్పునకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండా ల్సిందేనని మాజీ స్పీకర్ తమ్మి నేని సీతారాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అధికారం చేపట్టిన వైయస్ జగ న్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ సర్కార్ ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. బుధవారం తన నివాసంలో విలేకర్ల సమావేశం లో తమ్మినేని మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఆముదాలవలస నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి బాట పట్టేలా కృషి చేశానన్నారు. అయినప్పటికీ నియోజకవర్గ ప్రజానీకం ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తానన్నారు. ఎన్నికలు ఫలితాలు నిరాశ పరిచాయన్నారు. ఎన్నికల్లో గెలిచిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మనోభావాలకు అనుగుణంగా గెలిచిన అభ్యర్థులు నడుచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ పాలన లో లోపాలను తాము తెలుసుకుంటామని తెలిపారు. గత ఐదు ఏళ్ళలో అనేక హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. రాబోయే ఐదు ఏళ్ళ కూడా విజేతలుగా నిలిచిన అభ్యర్థులు వారి హామీలు నెరవేరుస్తారని కోరుకుం టున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో వైసీపీ తరుపున కష్టపడిన ప్రతీ నాయకునికి, కార్య కర్తకి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళ లా అందుబాటులో ఉంటామన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దు అని విజ్ఞప్తి చేశారు. కలిసికట్టుగా అందరం పార్టీ కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని శ్రీరామ్ మూర్తి జడ్పిటిసి బెండి గోవిందరావు, బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు. కోట రమణ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవికి సూరిబాబు రాజీనామా

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో 2020లో నియ మింపబడ్డాను. అప్పటి నుంచి నా కులం అభ్యున్నతికి, అభివృద్ధికి అహర్నిశలు శ్రమించాను. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు, నవరత్నాలను కులంలో అర్హులైన వారందరికీ అందేలా గత నాలుగేళ్లుగా నా వంతు కృషి చేశాను. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తూ నా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నాను. నా రాజీనామా పత్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేయడం జరిగింది. ఇప్పటి వరకు నాకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేసిన వైఎస్ జగన్‌మోహనరెడ్డి కి, వైఎస్ ఆర్‌సీపీ పార్టీ జిల్లా ముఖ్య నాయకులకు, నా డైరెక్టర్లకు, కార్యకర్తలకు, ప్రజలకు, కళింగ వైశ్య, భేరి వైశ్య కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అందవరపు సూరిబాబు బుధవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌కు అడుగడుగున జననీరాజనం

హారతులతో ఘన స్వాగతం పలికిన మహిళలు

విశాలాంధ్ర - కవిటి : సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే బెందాలం అశోక్ అడు గడుగున జననీరాజనం పలికారు. ఈ మేరకు బుధ వారం ఇచ్ఛాపురం నియోజక వర్గం శాసన సభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ స్వగ్రామం రామయ్యపుట్టుగ గ్రామానికి చేరు కున్నారు. ఈ సంద ర్భంగా అత్యధిక మెజా రిటీతో మూడవసారి గెలు పొంది ఎమ్మెల్యేగా స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు, జనసేన నాయకులు కార్యకర్తలు కొజ్జిరియా జంక్షన్ వద్దకు చేరుకొని సాదర స్వాగతం పలికారు. నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతి ఇచ్చి విజయ తిలకం దిద్దారు. ఈ సందర్భంగా కొజ్జిరియా జంక్షన్ నుండి ర్యాలీగా వచ్చి కవిటి లో శ్రీ చింతామణి అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి స్వగ్రామం రామయ్య పుట్టుగ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గౌతు శిరీషకు అభినందన వెల్లువ

విశాలాంధ్ర - పలాస : పలాస టిడిపి కార్యాలయం, ఎమ్మెల్యే గౌతు శిరీషకు అభినందనలు తెలియజేసేందుకు బుధవారం ఆమె ఇంటికి నాయకులు, కార్యకర్తలు బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు పలాస నియోజకవర్గం ఉన్న టిడిపి, జనసేన, బిజేపి నాయకులు కార్యకర్తలు తండోప తండాలుగా తరలి వచ్చి గౌతు శిరీష, పలాస టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరికు శు భాకాంక్షలు తెలిపారు. గౌతు శిరీష విజయం సాధించడంతో గ్రామాల్లో నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు టిడిపి నాయకులు పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, మల్లిపెద్ది నాని, మన్యాల శ్రీనివాసరావు, సాసుమాన చంద్రమౌళి, జగదీష్ పండా, జనసేన నాయకులు డాక్టర్ వి దుర్గారావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, జోగ మల్లి సప్ప నవీన్ టంకాల రవి శంకర్ గుప్తా మల్లా శ్రీనివాసరావు మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్ కుమార్ సవర రాంబాబు టిడిపి, జనసేన బిజేపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం త్రాగునీరు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : గత ఐదేళ్ళుగా త్రాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న కోటబొమ్మాళి మండల కేంద్రంలోగల ఒకటివ వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బుధవారం మంచినీటి ట్యాంకుల ద్వారా త్రాగునీరు అందించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకటివ వార్డుకు టీడీపీ శ్రేణులతో ప్రచారానికి వెళ్ళిన బోయిన రమేష్‌కు వార్డు ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమకు మంచినీటి సౌకర్యం కల్పించాలని వివరించారు. ఆయన వెంటనే స్పందించి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీ వార్డుకు తత్కాలికంగా మంచినీటి ట్యాంకుల ద్వారా తాగునీరు అందించి తరువాత ఇంటింటికి కుళాయిలు వేసి శాశ్వితంగా తాగునీరు అందస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ అధికారంలోకి వచ్చిన తెల్లవారే వార్డు ప్రజలకు ట్యాంకు ద్వారా మంచినీరు అందించారు. దీంతో ప్రజలు రమేష్‌కు అభినందనలు తెలియజేశారు.

దళిత వాడల్లో మౌలిక వసతులు కల్పనలో పాలకులు విఫలం

డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి

విశాలాంధ్ర - టెక్కలి : దళిత వాడల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో పాలకులకు చిత్తశుద్ధి లేదని, నేటికీ దళిత వాడల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కి కారణం పాలకులు కదా అని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పి ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి ప్రశ్నించారు. మండలం లచ్చునపేట గ్రామం లో బుధవారం సందర్శించి గ్రామస్తుల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట లాడు ఎస్సీ గ్రామం లో స్మశానానికి రహదారి లేక ప్రజలు పాడే మోసేందుకు కూడా కష్టపడాల్సి రావడం బాధాకరం అని, అధికారులకు, పాలకులకు ఎన్ని సార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడం దారుణం అన్నారు. వెంటనే రహదారి సౌకర్యం కల్పించి, కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం అయినా దళిత వాడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి దళితుల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. దళితుల సమస్యల పట్ల మా సంఘం ఎంతటి పోరాటాలకు అయినా సిద్ధపడుతుంది అని, ఈ గ్రామ సమస్యల పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటామని గ్రామస్తులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం లో బలగ రామయ్య, తొగరాన భిమారావు, కాయల గౌరమ్మ, బలగ రాములమ్మ, గారాలమ్మ, బలగ అనసూయ పాల్గొన్నారు.

నగరంలో కూటమి విజయ సంబరాలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : శ్రీకాకుళం నగరంలో అన్ని స్థానాలు కైవసం చేసుకుని విజయడంకా మ్రోగించిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షల వెల్లువల తాకిడితో టీడీపీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇంటి వద్ద జన సంచాతో ఎక్కడ చూసినా టీడీపీ జెండా రెపరెప లాడుతూ కనిపిస్తున్నాయి. కార్యకర్తలు భిన్నంగా గెలుపు సంబరాలను చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభా, పార్లమెంటు ఎన్నికల విజయదుంధుబి మ్రోగించిన కూటమ్ని అయినటువంటి టిడిపి, జనసేన, బిజేపి పెద్దలకు, శ్రీకాకుళం శాసనసభా కూటమి అభ్యర్థి డైనమిక్ లీడర్ గొండు శంకర్, యూత్ ఐకాన్ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలుపుతూ హడ్కోకాలనికి చెందిన టిడిపి కార్యకర్త తాళాబత్తుల శ్రీనివాసరావు పేద ప్రజలకు పలు ముఖ్య కూడళ్లలో సుమారు రెండు వందల మందికి అన్నవితరణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ యంగ్ లీడర్ గొండు. శంకర్ గెలుపు మరువరానిదని, ఆయన కళ, నెరవేరినందుకు ఆనందంగా ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఆయన ప్రజా నాడీ తెలుసుకున్నారని, సేవా తత్పురుషుడని, నిత్యాన్నధానంలో ఆయన చేసిన సేవకు ఎంత చెప్పినా తక్కువేనన్నారు. ఈ రోజు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని అన్నధాన వితరణ చేపట్టానని, గొండు విజయాన్ని ఈ విధంగా జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్త తాళాబత్తుల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, లక్ష్మి, పవన్ కుమార్, బి.రవి, కె.అశోక్, డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం...భూతాపాన్ని తగ్గిద్దాం..!

విశాలాంధ్ర - పలాస : పర్యావరణం కాపాడవలసిన బాధ్యత యువతపై ఉందని, నిరంతరం వాటిపై దృష్టి పెట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూర్యతేజ జూనియర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షులు ఎం కామేశ్వరరావు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శ్రీరామ సేవా సంఘం, గ్రీన్‌ఆర్మీ సంయు క్తంగా కాశీబుగ్గ అక్కుపల్లి, అక్కుపల్లి మెట్టూరు. రోడ్డు ఇరువైపులా కదంబ, బాదం, కాను, చెర్రీ తదితర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పర్యావరణం ప్రపంచ ప్రగతికి మూలం, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కలే ఆధారం కాబట్టి ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి భూతాపాన్ని నియంత్రించడంలో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉష్ణోగ్రతలు పెరగడానికి, ఋతువులు క్రమం తప్పడానికి కారణం పర్యా వరణం అదుపు తప్పడమే. కాబట్టి ప్రతి వ్యక్తి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లండ లోలాక్షి రామలింగం ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్ , సేవా సంఘ ఉపాధ్యక్షులు ఎం.జయశంకర్, ట్రెజరర్ సోమశేఖర రావు, సభ్యులు తమ్మ మహేష్ , జోగి రాజు, మద్దు తాతారావు, ముత్తి కుమారస్వామి, లండ దనరాజు అలాగే గ్రీన్‌ఆర్మీ ప్రధాన కార్యదర్శి బి.తిరుమల, సభ్యులు ఉపాధ్యాయులు కిషోర్ పాత్రో సైన్స్ ఉపాధ్యాయులు బి. దుర్యోధన, నీటిపారుదల శాఖ పి.శ్రీనివాస్, రైన్బో డిజిటల్ నూకల హేమసుందర్, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడిని మూడోసారి గెలిపించినందుకు ప్రజలందరికి అభినందనలు

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : భారతదేశ ప్రజలందరికీ వరుసగా మూడోసారి భారతదేశంలో ఎన్డీఏ కూటమిని నరేంద్ర మోడిని ముచ్చటగా మూడోసారి గెలిపించి నందుకు ప్రజలందరికి పేరుపేరునా హృదయ పూర్వక సమస్కారాలు తెలియజేస్తున్నట్లు వాన సోమేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా బిజెపి అధికార ప్రతినిధి, శ్రీకాకుళం జిల్లా బార్ టెలికాం బోర్డు సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

సహజ సేంద్రియ విధానంతో పర్యావరణ రక్షణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : సహజ సేంద్రీయ విధానం ద్వారా వ్య వసాయం చేస్తే పర్యావరణ పరిరక్షణ జరుగుతోందని వాసన్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం ఆర్ట్స్ స్వ చ్ఛంద సంస్థ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంర క్షించే బాధ్యత కూడా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూ లించాలని వివరించారు. చిరుధాన్యాల పంటలను అభివృద్ధి చేసి పర్యావ రణ రక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో బి శంకర్, మన్యం సహజ ఎఫ్ పి ఓ అనూష్, రవి, సందీప్, ఆర్ట్స్ సభ్యులు ఉన్నారు.

ఇచ్ఛాపురంలో ఓటమి వైసీపీ స్వయం కృపం!.. నేతల తీరే కారణమంటున్న విశ్లేషకులు

విశాలాంధ్ర - సోంపేట : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పిరియా విజయ ఓటమికి ప్రధాన కారణం ఆ పార్టీ నేతల స్వయంకృపమేనంటూ పార్టీ విశ్లేషకులు అంటున్నారు. పార్టీ నేతల్లో తరచూ విబేధాలు, నేతల్లో సమన్వయం అసలు లేకపోవడం, నేతల మధ్య ఈర్ష్య, ద్వేషాలు, ఒకరిపై ఒకరు అధిష్టానవర్గానికి ఫిర్యాదులు చేసుకోవడం, పార్టీ కార్యకర్తలతో అసలు సత్సంబంధాలు లేకపోవడం ఇలా అనేక కారణాలతో వైసీపీ అభ్యర్థి ఇచ్ఛాపురంలో ఘోరంగా ఓటమి చవి చూడాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోను ప్రతి చోటా టీడీపీ అభ్యర్థికే మెజార్టీ ఓట్లు రావడం గమనిస్తే ఏ ఒక్క మండలంలోను వైసీపీ తన ఆధిక్యాన్ని చాటుకోలేకపోయింది. సుమారు 40వేల ఓట్ల వ్యత్యాసంతో టీడీపీ అభ్యర్థి కన్నా వెనుకబడ్డ వైసీపీ అభ్యర్థి ఓట్లను గమనిస్తే మొత్తం 299 పోలింగ్ బూత్‌లలో సుమారు 20 పోలింగ్ బూత్‌లలో మినహాయించి మిగతా అన్ని చోట్ల టీడీపీకే ఆధిక్యం కనబడుతోంది. ఎన్నికల ముందురోజు వరకు విజయం తమకే వరిస్తుందని ధీమాగా ఉన్న వైసీపీ కేడర్‌కు ఫలితాలు భిన్నంగా రావడంతో బిత్తరపోయిన పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా ఉన్న ఇచ్ఛాపురంలో ఎలాగైనా ఈ ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ నాయకులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెల్సిందే. గత ఎన్నికల్లో పిరియా సాయిరాజ్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవి చూసినప్పటికి ఆయనకే నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగ్గాలు అప్పగించారు. ఆయన సతీమణి పిరియా విజయకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కిరీటాన్ని కట్టబెట్టారు. ఇక ముఖ్య నాయకుడు నర్తు రామారావుకు ఏపీ గ్రీన్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమించారు. అనంతరం ఎమ్మెల్సీగా నామినేట్ చేసి శాసన మండలిలో గొప్ప అవకాశం కల్పించారు. ఇచ్ఛాపురానికి చెందిన సాడి శ్యాంప్రసాద్‌రెడ్డికి సీడాప్ చైర్మన్‌గా నియమించారు. ఇచ్ఛాపురానికే చెందిన దక్కత లోకేశ్వరరెడ్డికి రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అలాగే కార్పోరేషన్ డైరెక్టర్లుగా దేవాడ మోహనరావు, మంగి ధనలక్ష్మి, మద్దు రాజారావు, కంచిలి జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి కుమార్తెలను నియమించిన సంగతి తెల్సిందే. ఇలా రాష్ట్రస్థాయి పదవుల్లో నాయకులకు ప్రాధాన్యం కల్పించినప్పటికి ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు విషయంలో ఒక్క ఆలోచనతో ఐక్యతగా పని చేయలేదన్న విమర్శలు మాత్రం తీవ్రంగా ఉన్నాయి. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఉన్న సాయిరాజ్ పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయపర్చుకుంటూ పార్టీని ముందుకు నడిపించడంలో విఫలమయ్యారనే విమర్శ అందరిలోను వినిపిస్తోంది. నియోజకవర్గంలో పార్టీ నాయకుల విషయానికి వస్తే నర్తు రామారావు, నర్తు నరేంద్ర, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, ఇప్పిలి కృష్ణారావు, పైల దేవదాసురెడ్డి, డాక్టర్ నిమ్మన దాసు, కడియాల ప్రకాష్, దక్కత లోకేశ్వరరెడ్డి, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, తడక జోగారావు, కొత్తకోట శేఖర్, ఇలా ఎంతో మంది ప్రముఖులు ఉన్నప్పటికి వారిలో సఖ్యత, సమన్వయం లేకపోవడం వీరి మధ్య తరచూ విబేధాలు నెలకొనడం పరిపాటిగా మారింది. కంచిలి జెడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, సోంపేట మండల జెడ్పీటీసీ తడక జోగారావులు ఎన్నికల ముందు వరకు సాయిరాజ్‌తో తీవ్రంగా విబేధించి పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉన్న విషయం తెల్సిందే. ఇటువంటి విభేదాలు కూడా పార్టీని బాగా నష్టపరిచాయంటూ కార్యకర్తలు వాపోతున్నారు. ప్రజలతో మమేకం కావాలని వారి సమస్యలు తెలుసుకోవాలని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించినప్పటికి ఈ కార్యక్రమం కేవలం తూతూ మంత్రంగానే నిర్వహించారు. గడచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గస్థాయిలో గాని, మండలస్థాయిలో గాని కార్యకర్తలతో కూడిన పార్టీ సమావేశాన్ని కూడా నిర్వహించుకోకపోవడం క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను నాయకులు అసలు పట్టించుకోకపోవడం ఎన్నికల్లో పార్టీ ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటని చెప్పవచ్చు. మండల కన్వీనర్ల నియామకం విషయంలోను పార్టీ ఏకాభిప్రాయంతో కాకుండా పెద్దల నామినేషన్‌తో నియమించడం చాలా మందికి ఇష్టం లేని విషయంగా మారింది. సోంపేట మండలం మారుమూల ఉన్న ఎంజీపురం వంటి పంచాయతీలో ఎంతో కాలంగా వైసీపీకి పెద్దదిక్కుగా ఉన్న నాయకులు పార్టీని వీడి టీడీపీలోకి చేరడం వంటి పరిస్థితులు కూడా ఆయా చోట్ల పార్టీని నష్టపరిచాయి. సోంపేట, బారువ, కవిటి, కంచిలి, కొర్లాం వంటి మేజర్ పంచాయతీల్లో మండల కేంద్రాల్లో పార్టీకి వ్యతిరేకంగా పెద్దమొత్తంలో ఓట్లు రావడం ఆపార్టీ నేతల పనితీరుకు అద్దం పడుతోంది. ఇలా కర్ణుడు చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లు ఇచ్ఛాపురంలో వైసీపీ ఓటమికి ఒకటి కాదు, రెండు కాదు చాలా కారాణాలు ఉన్నాయంటూ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - పలాస : వేసవి సెలవుల్లో విద్యార్థుల ఉపయోగార్థం, ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో పలాస మండలం, నీలావతిలో గల యు. వి. వి గ్రంథాలయంలో నిర్వహించిన 40 రోజుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులకు, ముఖ్యంగా 10వ తరగతిలో చేరబోవు విద్యార్థులకు ఉపయోగపడేలా గణితము, ఇంగ్లీష్ , ఫిజిక్స్ ఐఐటి ఫౌండేషన్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర సబ్జెక్టులపై ప్రావీణ్యం గల ఉపాధ్యాయులచే 40 రోజులు పాటు నిరాటంకంగా బోధన కొనసాగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈగల శ్రీనివాసరావు, ఎస్ వెంకటేష్, బట్టి రాజులను యు. వి.వి బృందం అభినందించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో అందరికీ అందుబాటులో ఉన్న యు వి వి గ్రంథాలయ సేవలు భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉండటము విశేషమని కొనియాడారు. ఉపాధ్యాయులు వెంకటేష్ విద్యార్థులను ఉద్దేశించి సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు బొమ్మాలి శివ, గౌరవ అధ్యక్షులు కుత్తుం ప్రకాష్ రావు, గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు పాలిన కృష్ణారావు, జినగ సీతారామయ్య, కుత్తుం సుధాకర్, కుత్తుం వినోద్, లైబ్రరియన్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు... అంబటి

విశాలాంధ్ర - అరసవల్లి : కాంగ్రెస్ తరపున నాకు టికెట్ ఇచ్చి శాసనసభ అభ్యర్థిగా ప్రకటించినందుకు పార్టీ అధిష్టానానికి మరియు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించి నాకు ఓట్లు వేసిన ఓటర్లకు ఈ ఎన్నికలకు సహకరించిన కాంగ్రెస్ కేడర్ కి నా కృతజ్ఞతలు పత్రికా ముఖంగా ద్వారా తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన అంబటి కృష్ణారావు గురువారం పేర్కొన్నారు. రాజకీయాల్లో జయాపజయాలు ఎలా ఉన్నా ప్రజా క్షేత్రంలో నిరంతరం కాంగ్రెస్ పార్టీ తరపు ప్రజలు కొరకు ప్రజల కోసం పోరాటాలు చేస్తానని అలాగే గెలిచిన అభ్యర్థులకు తన అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించే శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్లకు నా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : సార్వత్రిక ఎన్నికలలో మంగళవారం విడుదల అయిన ఫలితాల్లో శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులుగా వరుసుగా మూడో సారి విజయం సాధించిన కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, టెక్కలి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారీటితో గెలుపొందిన కింజరాపు అచ్చెన్నాయుడులకు స్థానిక మండల పరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమామల్లేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయనతో కలిసి పలువురు వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో కూటమి విజయ సంబరాలు

పలుచోట్ల అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : గ్రామాల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకుని విజయడంకా మ్రోగించిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షల వెల్లువల తాకిడితో టీడీపి కార్యాలయాలు,అభ్యర్థుల ఇంటి వద్ద జన సంచారంతో ఎక్కడ చూసిన టీడీపీ జెండా రెప రెపలాడుతూ కనిపిస్తున్నాయి.కార్యకర్తలు, భిన్నంగా గెలుపు సంబరాలను చేసుకుంటున్నారు. ఎన్నికల విజయ దుంధుబి మ్రోగించిన కూటన్ని అయిన టువంటి టిడిపి,జనసేన,బిజేపి కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు యూత్, నాయుకులు, కార్యకర్తలతో అన్న వితరణ చేపట్టారు

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

విశాలాంధ్ర - పొందూరు : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సూపరెండెంట్ సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినో త్సవం సందర్భంగా కోర్టు ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో న్యాయవాదులు బ్రహ్మాజీ, రామ్మోహన్, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీట్-2024 లో విజయ దుందుభి మ్రోగించిన నారాయణ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర - గార : ఇటీవల జరిగిన నీట్- 2024 పరీక్ష ఫలి తాల్లో నారా యణ విద్యా ర్థిని, విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యా ర్థిని, విద్యార్థులకు నారాయణ కళాశాల డీన్ మణి కుమార్, ఏజీఎం తిరుపతిరావు, గంగాధరరావు, కళాశాల ప్రిన్సిపాల్ పి ప్రసన్నకుమార్, జగన్, సత్య నారాయణతో పాటు కళాశాల సిబ్బంది ప్రశంసించారు. నీట్-2024లో అత్యుత్తమ ప్రతి భను కనబరిచిన విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల పాత్ర అభినందనీయమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కొనియాడారు.

ప్రభుత్వం లేకున్నా... వీడని నామినేటెడ్ పదవులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పాలయింది. కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందించారు. వెంటనే రాజీనామాను ఆమోదించారు. అనం తరం గవర్నర్ 15వ ఆంధ్రప్రదేశ్ అసెం బ్లీని రద్దు చేస్తూ నోటిఫికేషన్ విడుద ల చేశారు. అలాగే 17వ లోక్ సభను కూడా ఏకగ్రీవ తీర్మానంతో కేంద్ర ప్రభు త్వం రద్దు చేసింది. దేశవ్యాప్తంగా అ టు పార్లమెంటు ఇటు అసెంబ్లీ స్థానా ల గెలుపొందిన అభ్యర్థులు ముహూ ర్తంతో ప్రమాణ స్వీకారం చేయనున్నా రు. ప్రభుత్వం లేకున్నా వారు కల్పిం చిన పదవులు విడనాడేందుకు వైసీపీ నాయకులు మంకు పట్టు వీడడం లేదని తెలుస్తుంది. ఇదిలా ఉండగా అప్పటి రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పరి పాలన సౌలభ్యం కోసం కొన్ని నామి నేటెడ్ పదవులను నాయకులకు అందించారు. అంతేకాకుండా పార్టీని నమ్ముకుని పని చేసిన కార్యకర్తలకు ఉపాధి కల్పించే విధంగా ఆయా అనుచర గణానికి పదవులు కట్టు పెట్టారు. అందులో భాగంగానే స్థాని కంగా ఎన్నికల జరగని వ్యవసాయ పరపతి సంఘాలు(పిఏసిఎస్) కు చైర్మన్ ప్రతినిధులతో పాటు ఇరువు రు డైరెక్టర్లను కూడా నియామకం చేశారు. నలుగురు చైర్మన్లు 8 మంది డైరెక్టర్లు ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్నారు. ముఖ్యంగా శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఆముదాలవలస కు అన్ని వర్గాల నుంచి చైర్మన్ తో పాటు పాలకమండలి సభ్యులను నామినే టెడ్ చేశారు. ఇటీవల వెంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలు ఉన్నం దున కళ్యాణం జరిగినంతవరకు ఆ పదవులను పట్టుకుని వేలాడాలన్న ఉద్దేశంతోనే సభ్యులు ఉన్నట్లు తెలు స్తోంది. అలాగే ఏపీ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మ న్ డైరెక్టర్లు ఉన్నారు. బ్రాహ్మణ కార్పొ రేషన్ సంఘం, కళింగ కార్పొరేషన్, సాంస్కృతిక విభాగం డైరెక్టర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు వైసీపీ ప్రభుత్వం కల్పించిన పదవులను పట్టుకొని వేలాడు తున్నారు. అంతేకాకుండా కొంతమంది పదవులు అధికారికంగా లేనప్పటికీ నామినేటెడ్ సభ్యులు గానీ కొనసాగుతున్నారు. శిష్టకరణాల సంఘం డైరెక్టర్ గా కెవి రమణమూ ర్తి , సాంస్కృత విభాగం డైరెక్టర్ గా జలుమూరు జగన్ మోహన్ రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా బలివాడ రాజేష్ శర్మ, వెంకటేశ్వర టెంపుల్ పాలకవర్గం సభ్యునిగా జిల్లా ప్రశాంత్ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మ న్ తో పాటు 9 మంది సభ్యులు కూడా ఉన్నారు. వీరందరినీ ఆనాటి వైసీపీ ప్రభుత్వం నియమించింది. వీరి ద్వారా ఆయా సంస్థల కార్యకలాపాల ను నిర్వ హిస్తున్నారు. వైసీపీ ప్రభు త్వం శాసనసభను రద్దు చేయడంతో సామాజిక బాధ్యతతో వీరంతా రాజీ నామా చేయాల్సి ఉంది. జగన్మోహన్ రెడ్డి నేతృ త్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వము వీరికి బాధ్యతలు అప్పగిస్తూ ఆయా పదవులకు నామినేట్ చేశా రు. ప్రభుత్వం రద్దయిన తర్వాత నైతిక బాధ్యత వహించి వీరంతా రాజి నామాలను సంబంధిత అధి కారికి అందించాల్సి ఉన్న ప్పటికీ ఇంకా దోచుకోవాలన్న ఉద్దేశంతోనే ఆ పదవుల్లో కొనసాగుతున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ పదవులు కల్పించిన ప్రభుత్వం డిజాల్వ్ అయిన తర్వాత ఆ పదవులను అనుభవిస్తున్న వారు కూడా తప్పనిసరిగా వాటికి రాజీ నామా చేయవలసిన అవసరం ఉంది.

గొండు శంకర్‌కు వెల్లువెత్తిన అభినందనలు

శుభాకాంక్షలు చెప్పేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : ఉమ్మడి కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఘనవిజయం సాధించిన గొండు శంకర్ ను కలిసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి కార్యాలయానికి అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలు, బొకేలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉదయంనుంచి కూడా భారీగా పార్టీ శ్రేణులు బారులు తీరాలు. వచ్చే ప్రతీ ఒక్కరూ శంకర్ తో కలిసి ఫోటోలు దిగేందుకు పోటీ పడ్డారు. మహిళలు కూడా పాల్గొని శంకర్‌కు తిలకధారణ దిద్దారు. శంకర్ జిందాబాద్.సిఎం చంద్రబాబు జిందాబాద్, తెలుగుదేశం జిందాబాద్ అంటూ నినాదాలతో కార్యాలయ ఆవరణ అంతా హోరెత్తించారు, స్వీట్లు , పండ్లు పంపిణీ చేశారు.

కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

విశాలాంధ్ర - పార్వతీపురం : 2024 సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ శాసనసభ నియోజకవర్గంలోనిఏడుగురు అభ్యర్థులు పోటీచేయగా వారికి వచ్చిన ఓట్ల వివరాలను రిటర్నింగ్ అధికారైన పాలకొండ ఆర్ డి ఓ రమణ ప్రకటించారు. టీడీపి, జనసేన,బిజెపి ఉమ్మడి పార్టీలనుండి ఎంఎల్ఏ గా పోటీచేసి విజయం సాధించిన తోయక జగదీశ్వరికు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 83 వేల355 ఓట్లురాగా, వైయస్సార్సీపి నుండి పోటీచేసిన పాముల పుష్పాశ్రీవాణి కు 59వేల855ఓట్లు వచ్చాయి. బహుజన సమాజ్ పార్టీ నుండి పోటీ చేసిన తాడంగి మిన్నారావుకు 1432ఓట్లు, సిపిఎం నుండి పోటీ చేసిన మండింగి రమణకు 3923 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థులు అడ్డాకుల గీతారాణికు 767ఓట్లు, తాడంగి శ్రీహరి రావునాయుడుకు 508 ఓట్లు, మోసూరు నాగభూషణకు 690 ఓట్లు రాగా నోటాకు 4761 ఓట్లు వచ్చాయి. కురుపాం నియోజకవర్గంలోని ఇవిఎంల ద్వారా లక్షా 52 వేల 445 ఓట్లు , పోస్టల్ బ్యాలెట్ ద్వారా2846ఓట్లు పోలయ్యాయి. 24వేల 500ఓట్ల మెజార్టీతో ఆమె గెలుపొందారు.ఎమ్మెల్యేగా గెలిచిన జగదీశ్వరీకి రిటర్నింగ్ అధికారయిన పాలకొండ ఆర్డీవో రమణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎస్టీ జాతాపు కులానికి చెందిన జగదీశ్వరినీ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు 2022లో మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు సిఫార్సు మేరకు టీడిపి ఇన్చార్జిగా నియామకం చేశారు. ఆమె నిరంతరం కష్టపడి పార్టీ కోసం పనిచేస్తూ అందరితో కలిసిమెలిసి ఉండి నేడు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆమె గెలుపులో మూడుపార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలతో పాటు కురుపాం రాజు ప్రదీప్ కుమారుడు వైరిశర్ల వీరేష్ దేవ్, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజుల కృషిఎనలేనిది. నిజమైన గిరిజన మహిళగా ఆమె గిరిజనులకు న్యాయం చేస్తారని వారంతా ఆశిస్తున్నారు.

పర్యావరణాన్ని కాపాడండి : గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు కాపాడాలని అందరూ చెట్లు నాటాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆమె ఇంటి ముందు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచాలని, నాటిన మొక్కను కాపాడి భవిష్యత్తు తరాలకు దిక్సూచిగా నిలవాలన్నారు. రోజు రోజుకు భూతాపం పెరిగిపోతుందని వాటిని అడ్డు కునేందుకు అందరూ చెట్లు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

విశాలాంధ్ర - పార్వతీపురం : 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాలూరు శాసనసభ నియోజకవర్గంలోనిఏడుగురు అభ్యర్థులు పోటీచేయగా వారికి వచ్చిన ఓట్ల వివరాలను రిటర్నింగ్ అధికారైన ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ విష్ణు చరణ్ ప్రకటించారు. టీడీపి, జనసేన,బిజెపి ఉమ్మడి పార్టీలనుండి ఎంఎల్ఏ గా పోటీచేసి విజయం సాధించిన గుమ్మడి సంధ్యారాణికు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 80వేల211 ఓట్లురాగా, వైయస్సార్సీపి నుండి పోటీచేసిన రాజన్న దొర పీడికకు 66వేల478ఓట్లు వచ్చాయి. బహుజన సమాజ్ పార్టీ నుండి పోటీ చేసిన మువ్వల జ్ఞానప్రకాశంకు 1372ఓట్లు, భారత జాతీయ కాంగ్రెస్ నుండి పోటీ చేసిన మువ్వల పుష్పారావుకు 2239ఓట్లు, సమాజ్ వాదీ పార్టీ నుండి పోటీ చేసిన పుసురు సాయికు 749 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన 686ఓట్లు, కెళ్లమురళికు 877ఓట్లురాగా నోటాకు5743 ఓట్లు వచ్చాయి. సాలూరు నియోజకవర్గంలోని ఇవిఎంల ద్వారా లక్షా 56 వేల 324 ఓట్లు , పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2031ఓట్లు పోలయ్యాయి. 13వేల 733ఓట్ల మెజార్టీతో సంధ్యారాణి గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలిచిన సంధ్యారాణికు రిటర్నింగ్ అధికారయిన పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణు చరణ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సంధ్యారాణి తండ్రి జన్ని ముత్యాలు కూడా గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆమె భర్త జయకుమార్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కాగా, కుమారుడు కుమార్తె ఉన్నారు. గతంలో ఆమె రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారిఎంపీగా పోటీ చేసి ఓటమి. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలుగా ఉంటున్న సంధ్యారాణి నేడు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో చంద్రబాబు నాయుడు ఆమెకు గిరిజన కోటాలో మంత్రి పదవి ఇస్తారన్న ప్రసారం కొనసాగుతుంది. ఎమ్మెల్యేగా గెలిచిన సంధ్యారాణిని నియోజకవర్గ ఉమ్మడి పార్టీ నేతలు అభిమానులు కార్యకర్తలు మహిళలు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున కలిసి అభినందనలు తెలిపారు.

6,7 తేదీలలో మంచినీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రాంతాలలో మంచినీటి సరఫరా చేస్తున్న మూడవ భావి మరమ్మతులకు గురికావడంతో ఆరు, ఏడు తేదీలలో మంచినీటి సరఫరా కొళాయిల ద్వారా నిలిపివేయబడుతుందని కమిషనర్ కె.నాగేంద్ర కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మూడో భావి మరమ్మత్తులు కారణంగా పంపింగ్ నిలిపివేయడం జరిగిందని అంత వరకు అద్దె ట్యాంకర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందని అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రికార్డ్ స్థాయిలో ఎమ్మెల్యే మామిడి మెజారిటీ

విశాలాంధ్ర - కొత్తూరు : పాత పట్నం నియోజక వర్గంలో రికార్డు స్థాయి మెజారిటీ ని టీడీపీ అభ్యర్థి విజేత మామిడి గోవింద రావు సాధించారు. 1952 నుండి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎంఎల్ఏలలో టిడిపి అభ్యర్థి మామిడి 26427 ఓట్లు మెజారిటీ సొంతం చేసుకున్నారు.అంత క ముందు 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా శత్రుచర్ల విజయ రామారాజుకు 20750 ఓట్లు మెజారిటీ వచ్చింది. ఇదే ఒక రికార్డు, ఇపుడు నాటి రికార్డును మామిడి అధిగమించి కొత్త రికార్డు నెలకొల్పారు.